

**సదరం వేడుకలు:** లాలాపేటలో నిర్వహించిన సదరు ఉత్సవాలకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తనయులు రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లిఖార్జున్‌లు పాల్గొన్నారు.ఉస్మానియా యూనివర్శిటీ, నవంబర్ 13 :



**అన్నదానం:** సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నాగదేవత టెంపుల్ క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించారు.
– అడ్డగుట్ట, నవంబర్ 13.

### నేటి నుంచి తార్నాక లంబాడి బస్తీలో
## పద్మారావుగౌడ్ ప్రచారం ప్రారంభం

సికింద్రాబాద్,నవంబర్13: నేటి నుండి డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచార పాదయాత్ర తార్నాక లంబాడి బస్తీ నుంచి ప్రారంభంకానుందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకు రాంచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ప్రచార పాదయాత్ర మెట్టుగూడ డివిజన్ పరిధిలోని తార్నాక సమీపంలో లంబాడి బస్తీ నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు,కార్యకర్తలు,పజ్జన్న అభిమానులు,వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున్న హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.ఉదయం 10గంటలకు ప్రచార పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు.

## మాజీ కార్పొరేటర్ భౌతిక కాయానికి డిప్యూటీ స్పీకర్ నివాళి

రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్ మృతి పట్ల డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ సంతాపం తెలిపారు. సోమవారం ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకొనేందుకు నిరంతరం శ్రమిస్తూ తన ప్రత్యేకతను శీలం ప్రభాకర్ చాటుకున్నారని పద్మారావు గౌడ్ తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

అడ్డగుట్ట, నవంబర్ 13 : కుటుంబ కలహాల కారణంగా ఓ డెంటల్ డాక్టర్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...ఈస్ట్ మారేడుపల్లి ప్రాంతానికి చెందిన దివ్య(35) డెంటల్ వైద్యురాలు. తల్లిదండ్రులు లేకపోవడంతో తమ్ముడితో కలిసి దివ్య ఈస్ట్ మారేడుపల్లిలో ఉంటుంది. అయితే తమ్ముడు ఏమి పనిచేయకుండా తిరుగుతున్నాడని పలుమార్లు మందలించడం జరిగింది. దీంతో ఆయన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మనస్థాపానికి గురైన దివ్య ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతేదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు..

సిటీబ్యూరో,నవంబర్13: పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.గిరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉన్నతాధికారులతో.. సిబ్బందితో అనుచిత ప్రవర్తన ఆరోపణలపై సస్పెండ్ చేశారు.

# సకల సౌకర్యాలతో మన ఊరు–మన బడి

### సికింద్రాబాద్‌లో విద్యా రంగానికి పెద్ద పీట

- **సీఎం కేసీఆర్,డిప్యూటీ స్పీకర్ ప్రత్యేక చొరవ**
- **చురుగ్గా సాగుతున్న పక్కా భవనాల నిర్మాణ పనులు**

సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశారు. 10 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గంలో లేని ఇంటర్,డిగ్రీ కళాశాలలను సాధించి నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారు.విద్యా రంగానికి పెద్ద పీట వేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.అలాగే నిరుద్యోగుల కోసం సెట్విన్ సెంటర్‌లో ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిరుద్యోగుల కోసం ఎన్నో సార్లు సెట్విన్ కేంద్రం ఆధ్వర్యంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేశారు. అధ్యాపకులు విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటిని స్వయంగా పరిష్కరించిన ఘనత కూడా ఆయనదే.
– సికింద్రాబాద్, నవంబర్ 13



అడ్డగుట్ట ప్రభుత్వ స్కూల్‌లో సొంత ఖర్చులతో విద్యార్థులకు, సిబ్బందికి కంప్యూటర్లను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్.(ఫైల్ ఫొటో)

- విద్యారంగానికి కృషి చేస్తూ, రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా జూనియర్, డిగ్రీ కాలేజీలను సీతాఫల్ మండి ప్రభుత్వ స్కూల్ ఆవరణలో మంజూరు చేయించారు పద్మారావు గౌడ్. జూనియర్ , డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. వీటిలో జూనియర్ కాలేజీ కి రూ.6.30 కోట్లు, డిగ్రీ కాలేజీకి రూ.9 కోట్లు, హైస్కూల్/ప్రైమరీ స్కూల్‌కు రూ.14.45 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను ఇటీవలే ప్రారంభించగా చురుకుగా సాగుతున్నాయి.
- మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.మూడు కోట్ల మేర నిధులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మంజూరు చేసి సికింద్రాబాద్ పరిధిలో 10 స్కూల్‌ల్లో వివిధ సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. జామై ఉస్మానియా ప్రభుత్వ స్కూల్, లాలాపేట ప్రభుత్వ స్కూల్, అడ్డగుట్ట ప్రభుత్వ స్కూల్‌లలో ఇప్పటికే ఆయా పనులు పూర్తి చేశారు.
- సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,జామై ఉస్మానియాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక బాత్ రూంలు,షెడ్‌ల నిర్మాణ పనులతో పాటు తాత్కాలిక భవణ నిర్మాణ పనులు ప్రారంభం,లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,లాలాపేట మార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలు ఉన్నాయి.
- బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,జామై ఉస్మానియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,లాలాపేట డైరీ ఫామ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దూద్‌బావిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తునున్నట్లు పేర్కొన్నారు.
- అడ్డగుట్ట ప్రభుత్వ స్కూల్ లో సొంత ఖర్చుతో విద్యార్థులకు, సిబ్బందికి కంప్యూటర్ లను సమకూర్చారు. వివిధ ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు తన సొంత ఖర్చుతో పుస్తకాలను అందజేశారు.

### చదువుకు ఇబ్బంది లేకుండా..



సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన ఘనత డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాక ముందు కళాశాలలు , ప్రభుత్వ పాఠశాలలు లేక దూర ప్రయాణాలు చేసే వారు. అక్కడ సరైన వసతులు ఉండేవి కావు. ఇప్పుడు మా ఇంటి దగ్గరలోనే కేజీ టూ పీజీ విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,ఉన్నత పాఠశాల,ఇంటర్,డిగ్రీ కళాశాలతో పాటు రాజోయే రోజుల్లో పీజీ కళాశాల కూడా పద్మారావుగౌడ్ చొరవతో రానుంది.
– కనకట్ల, అరుణ,సీతాఫల్‌మండి

### సీఎం కేసీఆర్, డిప్యూటీ స్పీకర్ కృషి తోనే ..



సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేజీ టూ పీజీ కళాశాలలు,పాఠశాలలు అన్నీ ఒకే వేదికపైకి వస్తాయని మేము కలలో కూడా ఊహించలేదన్నారు. అవన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్,డిప్యూటీ స్పీకర్‌ల చొరవతోనే సాధ్యమయ్యాయని తెలిపారు.అవన్నీ సీతాఫల్‌మండిలోనే ఏర్పాటు కావడం సంతోషకరం.– నవీన్‌గౌడ్,ఇందిరానగర్‌కాలనీ.

## ఐక్యతకు ప్రతీక సదర్

### నేడు నారాయణగూడ చౌరస్తాలో సదర్ ఉత్సవాలు

హిమాయత్‌నగర్,నవంబర్13: దీపావళి పర్వదినం సందర్భంగా ప్రతి ఏడాది ఐక్యతకు ప్రతీకగా యాదవులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సదర్ ఉత్సవాల సందడి మొదలైంది. దీపావళి పండుగ తరువాత రెండో రోజు నేడు( మంగళవారం) నారాయణగూడ వైఎంసీ ఏ చౌరస్తాలో నిర్వహించే సదరు ఉత్సవాలకు దాదాపు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. యాదవ సోదరులు సదర్ ఉత్సవంలో ప్రదర్శించడానికి వచ్చే దున్న పోతులకు తర్ఫీదు ఇచ్చారు. ముత్యాలు, రంగు రంగుల పూసలతో వాటిని ముస్తాబు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 67 ఏళ్లుగా నారాయణగూడ చౌరస్తాలో ఈ సదర్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నా యి. యాదవ కులస్తులు దున్న పోతులతో ప్రదర్శన, నృత్యాలు ఆడిపిస్తూ చేపట్టే ఉత్స వమే సదర్ ఉత్సవం. ఉత్సవాలను వీక్షించేందుకు వచ్చే ప్రజల కోసం వినోదం, విజ్ఞానం అందించేందుకు కళాకారులచే సాంస్కృతిక కార్య క్రమాలు జరుగనున్నాయి.ఏసీపీలు10మంది, సీఐలు 15మంది, 25 మంది ఏస్సైలు, 400 మంది కానిస్టేబుల్స్‌లతో పాటు సీసీ. కెమెరాలు, మఫ్టీ పోలీసులు,షీ టీమ్‌తో ప్రత్యేకంగా నిఘా ఉంటుందని నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు.ఈ ఉత్సవాల నేపథ్యంలో నారాయణగూడ, హిమాయత్ నగర్,బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, వాహన దారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు.



నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

## 24మద్యం బాటిళ్లు స్వాధీనం

బంజారాహిల్స్: కారులో అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న పబ్ మేనేజర్ మీద జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్36లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన బొలెరో కారు(టీఎస్09ఈఆర్2232)ను ఆపి తనిఖీ చేయగా కారులో 24 గ్రాంట్ విస్కీ ఫుల్‌బాటిళ్లు లభ్యమయ్యాయి. కారు నడపిస్తున్న వ్యక్తి జూబ్లీహిల్స్‌లోని తబులరస పబ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వరుణ్ చద్దా(40) అని తేలింది. అనుమతి లేకుండా మద్యాన్ని తరలిస్తున్న వరుణ్‌చద్దా మీద కేసు నమోదు చేసిన పోలీసులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

### అనుమానాస్పద స్థితిలో
## యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్,నవంబర్ 13: అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌కు చెందిన రాహుల్(25) ఆరేళ్లుగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో స్నేహితులతో కలిసి నగరానికి వచ్చిన రాహుల్ గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్నాడు.

ఈ నేపథ్యంలో దీపావళి కోసం తనతో పాటు గదిలో ఉంటున్న ఇద్దరు స్నేహితులు ఊరేళ్లడంతో ఒంటరిగా ఉన్న రాహుల్ ఆదివారం అర్థరాత్రి దాటిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖనకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.